## క్లుప్తంగా

### రూ.30 లక్షలతో ఇంటింట కుళాయిలు



కుళాయి పనులకు భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు

గుర్ల: మండలంలోని భూపాలపురంలో రూ.30 లక్షలతో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, సర్పంచ్ శీర విజయకుమారి శుక్రవారం భూమిపూజ చేశారు. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కుళాయిల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

### నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం గ్రామంలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు తూర్పాటి వెంకటరామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.విశాఖపట్నం మహారాణిపేటలోని అను న్యూరో కార్డియాక్ ఆస్పత్రికి చెందిన గుండె వైద్య నిపుణులు జి.పాల్‌కిరణ్ నేతృత్వంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గుండె నొప్పి, దడ, బీపీ, గ్యాస్ట్రిక్, ఉదర, కిడ్నీ సమస్యలు, నిద్రలేమి వంటి సమస్యలు ఉన్నవారు శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

### ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



గనివాడలో వేతనదారులను విచారిస్తున్న ఆడిట్ బృందం

లక్కవరపుకోట: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి 3వ తేదీ వరకు చేపట్టిన పనులు, నిధుల ఖర్చు తదిత ర అంశాలపై గత రెండు రోజులుగా సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ సీహెచ్.అప్పారావు తెలిపారు. మండలంలోని పలుగ్రామాల్లో 15 బృందాలు శుక్రవారం ఆడిట్ నిర్వహించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.15,38,4,500 వ్యయంతో చేపట్టిన 505 పనులపై క్షేత్రస్థాయిలో ఆడిట్ చేస్తున్నామని రిసోర్స్‌పర్సన్ అప్పారావు తెలిపారు. ఈనెల 21వ తేదీ వరకు ఆడిట్ చేసి, అనంతరం మండల కేంద్రంలో నిర్వహించే ప్రజావేదికలో నివేదికలు సమర్పిస్తామని వివరించారు.

### 23న ఆశీల వేలం, టెండర్ల ఖరారు

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలో రోజువారీ మార్కెట్‌లో ఆశీల వసూళ్లు, సులబ్ కాంప్లెక్స్, 2023–24 సంవత్సరానికి సంబంధించి పాత దినపత్రికలకు పంచాయతీ కార్యాలయం వద్ద ఈ నెల 23న మధ్యాహ్నం వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓపీహెచ్.కన్నబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే అదే రోజు కాంట్రాక్టు పారిశుద్ధ్య సిబ్బంది సప్లయ్, ఆర్‌డబ్ల్యూఎస్ పంపుల నిర్వహణ, విద్యుత్ నిర్వహణ, ప్రజారోగ్య వాహనాలు నడుపుటకు డ్రైవర్స్, తదితర 9 అంశాలకు టెండర్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు.సంబంధిత టెండర్లను అదే రోజు ఖరారు చేస్తామని తెలిపారు.

### ఇంటి పన్ను శతశాతం వసూలు చేయాలి



వల్లంపూడిలో సచివాలయ సిబ్బంది,వలంటీర్లకు సూచనలిస్తున్న ఈఓపీఆర్డీ సూర్యనారాయణ

వేపాడ: ఈ నెలాఖరునాటికి ఇంటి పన్నులు శతశాతం వసూలు చేయాలని ఈఓపీఆర్డీ సీహెచ్. సూర్యనారాయణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వేపాడ, వల్లంపూడి గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఇప్పటివరకు ఇంటి పన్ను వసూళ్లు ఎంతమేర పూర్తి చేశారని ఆరా తీశారు. పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తడి,పొడి చెత్త వేరుచేయడం, చెత్త నుంచి సంపద తయారుచేయడం, వర్మీ కంపోస్టు తయారీ తదితర అంశాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శులు భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గజపతినగరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని, యోగా ప్రతీ ఒక్కరి దిన చర్యలో భాగం కావాలని యోగా శిక్షకులు శీర వాసు అన్నారు. స్థానిక కల్కి భగవాన్ ధ్యాన మందిరంలో శుక్రవారం ఉచిత యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో చాలా మంది ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతగానో సహాయ పడుతుందని చెప్పారు. ఇక్కడ యోగా ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించి 1700 రోజులు పూర్తయ్యాయని చెప్పారు.

# మహిళా మార్ట్‌లు భళా

- రూ. కోటి పెట్టుబడితో రెండు మార్ట్‌లు
- 34,385 మంది మహిళల భాగస్వామ్యం
- శాశ్వత ఉపాధికి చేయూత
- ఆర్థిక లావాదేవీలపై శిక్షణ




ఎస్.కోటలో మహిళలు నిర్వహిస్తున్న చేయూత మహిళా మార్ట్



గరివిడి మహిళా మార్ట్‌లో కొనుగోలుదారుల సందడి

శృంగవరపుకోట: మహిళలు ఆర్థికస్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక విధాలుగా వారిని ప్రోత్సాహిస్తోంది. సొంతకాళ్లపై నిలబడి ఆర్థిక ప్రగతి సాధించడమే కాకుండా వారే పది మందికి ఉపాధి కూడా కల్పించేలా వారికి సహాయసహకారాలు అందిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళలు నేడు వ్యాపార విపణిలో మహారాణుల్లా రాణిస్తున్నారు. సామూహికంగా మహిళలంతా ఆర్థిక స్వేచ్ఛ సాధించాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ క్రాంతి పదం ఆధ్వర్యంలో 'చేయూత మహిళా మార్ట్'ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్రంలో 22 మార్ట్‌లు ఏర్పాటు కాగా, విజయనగరం జిల్లాలో రెండు మార్ట్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో 34,385 మంది మహిళలు భాగస్వాములయ్యారు.

**కోటి రూపాయల పెట్టుబడితో...**

ఈ మార్ట్‌ల్లో స్వయంసహాయక సంఘాల సభ్యులందరి భాగస్వామ్యం ఉండాలన్నదే ప్రభుత్వ యోచన. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి సమ్మతించిన వారొక్కక్కరీ నుంచి రూ.310 చొప్పున వాటా ధనం సేకరించారు. ఎస్.కోట మండలంలో 17,800 ఇచ్చిన షేరుధనం రూ.55,18,000, గరివిడి మండలంలో 16,585 మంది ఇచ్చిన షేరుధనం రూ.51,41,350 మొత్తం కలిపి రూ.1,06,59,350తో ఎస్.కోట, గరివిడిలో గత నెలలో 'చేయూత మహిళా మార్ట్'లను ప్రారంభించారు.

**డీఆర్‌డీఏ పర్యవేక్షణలో ..**

డీఆర్‌డీఏ పర్యవేక్షణలో వైఎస్సార్ క్రాంతి పదం ఉద్యోగులు మహిళలకు వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, డేటా ఎంట్రీ, జీఎస్‌టీ, బిజినెస్ స్కిల్స్, కమ్యూనిటీ స్కిల్స్‌లో పూర్తిస్థాయి శిక్షణ ఇప్పించారు. వ్యాపార నిర్వహణకు కావాల్సిన జీఎస్‌టీ, టాన్, టిన్, లేబర్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ లైసెన్స్ వంటి అన్ని అనుమతులు వారే చేయించి మాక్స్ (ఎంఏసీటీఎస్) సొసైటీలో చేయూత మార్ట్‌లు రిజిస్ట్రేషన్ చేశారు. ప్రధాన ఉత్పత్తి కంపెనీలు నేరుగా మహిళా మార్ట్‌లకు సరుకులు ఇచ్చేలా ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుంది. వీటితో పాటూ డ్వాక్రా, వీడీవీకే ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.

**అన్నీ సరకులు అందుబాటులో..**

అన్ని రకాల నాణ్యమైన నిత్యావసర సరుకులను తక్కువ ధరలో ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నదే మహిళా మార్ట్‌ల లక్ష్యం. డ్వాక్రా సంఘాల నుంచి ఎన్నుకున్న ముగ్గురి సభ్యుల కమిటీ మార్ట్ కమిటీ నిర్వహణ బాధ్యతలు చూస్తుంది. వీరే మార్ట్‌లో ఉద్యోగుల ఎంపిక, వేతనాల చెల్లింపు, లావాదేవీలు పర్యవేక్షిస్తారు. ప్రస్తుతం ముగ్గురు చొప్పున ఉద్యోగులున్న గరివిడి మార్ట్ రోజుకి రూ.68వేలు, ఎస్.కోట మార్ట్ రూ.58 వేల వ్యాపారం చేస్తున్నాయి.

**మహిళల జీవనోపాధికి చేయూత**



'చేయూత' పథకం ద్వారా ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో మహిళలు సొంతంగా వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. మరింత మంది మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని, వారిని పెట్టుబడిదారులుగా చేసి, 'చేయూత మహిళా మార్ట్‌లు' నెలకొల్పిందీ ప్రభుత్వం. జిల్లాలో ఉన్న రెండు మార్ట్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి.

– వి.రవికుమార్, డీపీఎం, వైఎస్సార్‌క్రాంతి పదం, విజయనగరం జిల్లా



ఎస్.కోట మహిళామార్ట్‌లో సరుకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

**విస్తరించే యోచనలో..**



వ్యక్తిగత జీవన ప్రమాణాల నుంచి గ్రూప్ యాక్టివిటీ ద్వారా ఎక్కువ మందికి ప్రయోజనం చేకూర్చాలని మహిళా మార్ట్‌లు తెచ్చాం. ఎస్.కోట, గరివిడిలో వీటిని ప్రారంభించాం. ప్రభుత్వం ఎంఎన్‌సీ కంపెనీలతో ఎంఓయూ చేసుకుంది. 'చేయూత' పథకం సహాయంతో జిల్లాలో 4 వేల కిరాణా షాపులను మహిళలు నడుపుతున్నారు. ఇప్పుడు వాళ్లని కూడా మార్ట్‌ల వైపు మళ్లించి, వ్యాపారాన్ని విస్తరించేలా చేయాలని ఆలోచన చేస్తున్నాం. రైతు ఉత్పత్తులను ప్రొక్యూర్ చేసి అమ్మకం చేయాలని, చూస్తున్నాం. ప్రతీ నియోజకవర్గంలో ఒక మార్ట్‌ను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నాం.

– ఎ.కళ్యాణ చక్రవర్తి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్డీఏ, విజయనగరం జిల్లా

**అందరూ సమాన భాగస్వాములే**



చేయూత మహిళా మార్ట్ నిర్వహణకు ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్‌గా ముగ్గురం ఉన్నా... అన్ని నిర్ణయాలు గ్రూపుల్లోని సభ్యులతో మాట్లాడి తీసుకుంటాం. పెట్టుబడుల్లో, లాభాల్లో అందరూ సమాన భాగస్వాములే. నాణ్యమైన సరుకులు వీలైనంత తక్కువ ధరకు ప్రజలకు అందించాలని చూస్తున్నాం. ప్రసుతం మార్ట్‌లో రోజుకు సుమారు రూ.60 వేల వ్యాపారం జరుగుతోంది. వైఎస్సార్ క్రాంతి పదం ఉద్యోగులు నిత్యం పర్యవేక్షిస్తూ, తగిన సూచనలు ఇస్తున్నారు.

– గడి జ్యోతి, మహిళా మార్ట్ సెక్రటరీ, భవానీనగర్, ఎస్.కోట మండలం.

### సచివాలయంలో కలెక్టర్ తనిఖీలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

చీపురుపల్లిరూరల్: మండలంలోని రావివలస గ్రామ సచివాలయంలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. పథకాల అమలుపై, గర్భిణులు, చిన్నారులకు రక్త పరీక్షలు చేస్తున్నారా లేదా, పోషకాహార పంపిణీ, గృహ నిర్మాణాలపై ఆయా శాఖలకు సంబంధించిన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 'సఖి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని చెప్పారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రం తదితర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

### ఘనంగా త్రిపురమాంబ తీర్థం



పూజలందుకుంటున్న త్రిపురమాంబ

వేపాడ: మండలంలోని చినదుంగాడ గ్రామదేవత త్రిపురమాంబ అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం



రావివలసలో భూరీసర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

చీపురుపల్లిరూరల్/ మెరకముడిదాం: రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూరీసర్వేతో శాశ్వత పరిష్కారం లభించనుందని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. చీపురుపల్లి మండలంలోని రావివలస, మెరకముడిదాం మండలంలోని భైరిపురం గ్రామంలో చేపడుతున్న భూరీసర్వేను శుక్రవారం ఆమె పరిశీలించారు. సర్వే సిబ్బందితో ఆమె మాట్లాడుతూ చీపురుపల్లి, మెరకముడిదాం మండలంలో ఇప్పటి వరకు చేపట్టిన భూసర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలో సర్వే పక్కాగా చేపట్టాలని, వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. రైతులు కూడా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. చీపురుపల్లి డీటీ సంతోష్, సర్వేయర్‌లు అప్పలనాయుడు, జానకీరామ్, మాజీ సర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలంరాజుపేటలో 'ఫ్యామిలీ డాక్టర్'



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సాయికృష్ణ

గజపతినగరం రూరల్: ప్రారంభించిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని మండలంలోని మరుపల్లి పీహెచ్‌సీ పరిధిలో క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని వైద్యాధికారి సాయికృష్ణ అన్నారు. మండలంలోని కాలంరాజుపేట సచివాలయంలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఓపీ(అవుట్ పేషెంట్) సేవలందించారు. అనంతరం గృహసందర్శన చేశారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక రోగగ్రస్తులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, పాఠశాలలో విద్యార్థులకు వైద్య తనిఖీలు చేశారు. స్థానిక సచివాలయ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు



మాట్లాడుతున్న ఏఎస్పీ పర్వీన్

గజపతినగరం రూరల్: యువత మాదకద్రవ్యాల జోలికి పోయి ఆరోగ్యాన్ని, భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ అస్మా పర్వీన్ సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాలపై మండలంలోని మరుపల్లి బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెడువ్యసనాలకు బానిసగా మారితే జీవిత అంధకారమవుతుందని, ప్రతి ఒక్కరూ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఎక్కడైనా ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినా, వినియోగించినా 14500 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కళాశాల కరెస్పాండెంట్ రెడ్డి చంద్రశేఖర్, గజపతినగరం సీఐ లెంక అప్పలనాయుడు పాల్గొన్నారు.

## ఎస్‌డబ్ల్యూపీసీల సందర్శన



కిండాం అగ్రహారంలోని ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సుగుణాకరరావు

బొండపల్లి: మండలంలోని కొండకిండాం, కిండాం అగ్రహారం,గరుడుబిల్లి తదితర గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ)ను ఈఓపీఆర్డీ సీహెచ్.సుగుణాకరరావు శుక్రవారం సందర్శించారు. కేంద్రాలన్నింటినీ పూర్తిస్థాయిలో వినియోగంలో కి తీసుకురావాలని, వర్మీ కంపోస్టు తయారు చేసి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి రోజూ చెత్త సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు.

## నేలకొరిగిన అరటి పంట



గంట్యాడ: పెద మదుపాడలో నేలకొరగిన అరటి పంట

గంట్యాడ: అల్పపీడన ద్రోణి ప్రభావంతో శుక్రవారం వీచిన ఈదురుగాలులకు మండలంలోని చినమదుపాడ, పెదమదుపాడ గ్రామాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లింది. ఆయా గ్రామాల్లో 30 నుంచి 40 ఎకరాల్లో అరటిపంట నేలకొరిగిందని రైతులు వాపోతున్నారు.

**చిరుజల్లులతో అవస్థలు**



గజపతినగరం: కాలంరాజుపేటలో మొక్కజొన్న కండెలు తడిసి పోకుండా టార్పాలిన్‌లు కప్పుతున్న రైతులు

గజపతినగరం: మండలంలోని మొక్కజొన్న కోతలు పూర్తి చేసిన రైతులు శుక్రవారం కురిసిన చిరుజల్లులకు పంట తడిసి పోకుండా కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. గజపతినగ రంతో పాటు శ్రీరంగరాజపురం, పిడిశీల, కాలం రాజుపేట, డోళపాలెం, సీతారామపురం, ఎస్.జి.ఆర్.పురం తదితర గ్రామాల్లో రైతులు ఇప్పటికే మొక్కజొన్న కోతలు చేసి కండెలను పొలాల్లో అరబెట్టారు. శుక్రవారం చిరుజల్లులు కురవడంతో ఆరబెట్టిన మొక్కజొన్న కండెలు తడిసిపోకుండా వాటిని పోగులు చేసి టార్పాలిన్‌లు కప్పుతూ బిజీగా కనిపించారు.

**పంట కోతలు వాయిదా వేసుకోండి**

బొండపల్లి: అల్పపీడనద్రోణి ప్రభావంతో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు మొక్కజొన్న, ఇతర పంటల కోతలను వాయిదా వేసుకోవాలని ఏఓ పి.వి.మల్లికార్జునరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మొక్కజొన్న కోతలు చేసిన వారు పంటను తడిసి పోకుండా భద్రం చేసుకోవాలని సూచించారు.

## చిరుధాన్యాలతో ఆరోగ్య సిరులు




వేపాడ: వేపాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఎం శ్రీనివాసరావు, మహిళాసంఘాల సభ్యులు

చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, పూర్వీకులు వీటిని ఆహారంగా తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేవారని వైఎస్సార్ క్రాంతి పదం, డీఆర్డీఏ అధికారులు అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ క్రాంతి పదం, డీఆర్డీఏ, మండల సమాఖ్యల ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగు ఆవశ్యకత, వాటి ప్రయోజనాలపై ప్రజలకు, రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు శుక్రవారం అవగాహన కల్పించారు. వేపాడ, జామి, గంట్యాడ, గజపతినగరం, ఎల్.కోట, కొత్తవలస మండల కేంద్రాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. కొర్రలు, సామాలు, అరికలు, ఊదలు, అండుకొర్రలు, బరిగలు తదితర చిరుధాన్యాలను సాగుచేయాలని రైతులకు సూచించారు. అలాగే కొత్తవలస మండలం ఉత్తరాపల్లి, లక్కవరపుకోట మండలం చందులూరు గ్రామాల్లో సబల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు చిరుధాన్యాల సాగు,సస్యరక్షణ ,విత్తన గుళికలు తయారీ తదితర ఆంశాలపై అవగాహన కల్పించారు. వెలుగు, ఎఫ్‌పీఓ ఏపీఎంలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

– వేపాడ, గజపతినగరం, గంట్యాడ, కొత్తవలస, లక్కవరపుకోట,జామి



జామి: జామిలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలు



లక్కవరపుకోట: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు



కొత్తవలస: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, వెలుగు సిబ్బంది



గజపతినగరం : గజపతినగరంలో ర్యాలీ చేస్తున్న వెలుగు సిబ్బంది



లక్కవరపుకోట: చందులూరులో విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పిస్తున్న సబల సంస్థ ప్రతినిధులు




గంట్యాడ: మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాస్

### జిల్లాస్థాయి గుర్రాల పరుగు పోటీలు రేపు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో ఆదివారం జిల్లా స్థాయి గుర్రం పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు భోజింకి ఎర్నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ దేవత ఎర్నిమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



తమ్మిరాజును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రామారెడ్డి, తదితరులు

డెంకాడ: సాంకేతికతలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని టెస్సలోవ్ సెమీకండక్టర్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ జి.తమ్మిరాజు అన్నారు. జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థి సంఘం 'లక్ష్య' ఆధ్వర్యంలో లక్ష్య–2కె23 కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తమ్మిరాజు మాట్లాడుతూ..ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రత్యామ్నాయ శక్తి వనరులు, ఎలక్ట్రికల్ వెహికల్స్, చిప్ డిజైనింగ్ తదితర రంగాల్లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వివరించారు. అందుకు దీటుగా విద్యార్థులు తయారు కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రికల్ వెహికల్స్‌పై వర్క్‌షాప్, ప్రాజెక్టు ఎక్స్‌పో, పోస్టర్ ప్రెజెంటేషన్ వంటి వివిధ రకాల పోటీలు నిర్వహించారు. వాటిని తిలకించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం తమ్మిరాజును ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, సంస్థ కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, ఈఈఈ హెచ్ఓడీ కె.సుబ్బరామయ్య, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, వివిధ విభాగాధిపతులు జి.ప్రకాష్‌బాబు, రాజేన్‌బాబు, రామారావు, రాజేంద్ర, సతీష్‌పూజారి, దుర్గాశైలజ, సతీష్, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.